క్లుప్తంగా

భూసార పరీక్షలతో ఎంతో మేలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కొత్తూరు: పంటల సాగులో అనుసరించాల్సిన ఆధునిక పద్ధతులపై వ్యవసాయ శాస్త్రవేత్తలు సోమవారం రైతులకు అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని పెంజర్ల గ్రామంలో నిర్వహించిన రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. పంటల సాగుకు ముందు రైతులు తప్పకుండా భూసార పరీక్షలు చేపట్టాలని సూచించారు. భూసార పరీక్షలతో పొలాల్లో ఉన్న పోషకాలు తదితర సమాచారం తెలుస్తుందన్నారు. ముఖ్యంగా వరుసగా ఒకే రకమైన పంటలు కాకుండా పంటమార్పిడి విధానంతో దిగుబడి పెరుగుతుందన్నారు. చీడపీడల నివారణ, సస్యరక్షణ, యాజమాన్య పద్ధతులపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త రామాంజనేయులు, ఏఓ గోపాల్‌నాయక్, ఏఈఓ తదితరులు పాల్గొన్నారు.

వేసవి శిక్షణ శిబిరాలు విజయవంతం

శంకర్‌పల్లి: గత 15 రోజుల నుంచి మండలంలో నిర్వహించిన వేసవి శిక్షణ శిబిరాలు విజయవంతమైనట్లు మండల విద్యాధికారి అక్బర్ ప్రకటించారు. సోమవారం మండలంలోని మోకిలతండా ప్రాథమిక పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఈ కార్యక్రమం ద్వారా విద్యార్థుల్లో క్రీడా నైపుణ్యం, పుస్తక పఠనం, చిత్రలేఖనం తదితర అంశాలపై పట్టు వచ్చిందన్నారు. ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు రాములు, ఉపాధ్యాయులు శివకుమార్, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నాం



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

శంకర్‌పల్లి: మున్సిపాలిటీ పరిధిలోని సింగాపురంలో గత నెలరోజుల నుంచి తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని, ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదంటూ సోమవారం వార్డు మహిళలు ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. మున్సిపల్ అధికారులకు వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. 10వ వార్డులో గత నెలరోజుల నుంచి తాగునీరు లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. సింగాపురంలో 2 వార్డులు ఉన్నప్పటికీ ఒక వార్డులో ట్యాంకర్ ద్వారా నీటిని సరఫరా చేయడం, మరొక వార్డులో పోయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు స్పందించి బోర్లు మరమ్మతులు చేయించి, నీటి సరఫరా చేయించాలని కోరారు. దీనిపై బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. గత నెల 22న తాగునీటి సమస్యపై కమిషనర్‌కి ఫిర్యాదు చేశామని, అయినప్పటికీ స్పందించడం లేదన్నారు. పరిస్థితి ఈ విధంగానే ఉంటే, సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్తామన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు వైద్య పరీక్షలు



కార్మికులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మొయినాబాద్‌రూరల్: మున్సిపల్‌లో పనిచేస్తున్న కార్మికులు ఆరోగ్యంగా ఉన్నప్పుడే పారిశుద్ధ్య పనులు సక్రమంగా నిర్వహిస్తారని కమిషనర్ ఖాజామొయిజుద్దీన్ అన్నారు. సోమవారం మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికులకు ఎన్కెపల్లి సమీపంలోని భాస్కర ఆస్పత్రిలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా కార్మికులకు అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. అవసరమైన వారికి మందులు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఆరోగ్యంపై కార్మికులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. కార్మికులకు ఉచిత వైద్యసేవలు అందించిన ఆస్పత్రి సిబ్బందిని అభినందించారు. కార్యక్రమంలో రిటైర్డ్ పోలీసు అధికారి యాదయ్య, మున్సిపల్ అధికారులు వెంకటేశ్వర్‌రెడ్డి, సుదర్శన్, రాఘవేందర్, వెంకయ్య, వైద్యులు రాజశేఖర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తీరని 'మీసేవ' కష్టాలు

- మొయినాబాద్ మండలంలో ఒకటే సెంటర్
- చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, రైతులు, విద్యార్థులకు తప్పని తిప్పలు
- పట్టించుకోని అధికారులు



మొయినాబాద్ మండలంలోని రెడ్డిపల్లి మీసేవ కేంద్రం

మొయినాబాద్: మండలంలో ఒకటే మీసేవ కేంద్రం ఉంది. అది కూడా మండల కేంద్రంలో కాకుండా రెడ్డిపల్లి గ్రామంలో ఉంది. మండల ప్రజలందరూ అక్కడికి వెళ్లాలంటే చాలా కష్టంగా భావిస్తున్నారు. అందుబాటులో మీసేవ కేంద్రం లేక ప్రజలు, విద్యార్థులు, రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గతంలో రెండు మీసేవ కేంద్రాలు మూతపడ్డాయి. మూతపడ్డ వాటిని తెరిపించి కొత్త మీసేవ కేంద్రాలు సైతం ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. కానీ అధికారులు మాత్రం కనీస చర్యలు తీసుకోవడం లేదు. వెంటనే కొత్త కేంద్రాలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మధుసూదన్‌రెడ్డి గత నెల 24న మొయినాబాద్‌లో జరిగిన భూ భారతి చట్టంపై అవగాహన కార్యక్రమానికి హాజరైన జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి విన్నవించారు. ఇప్పటికైనా మీ సేవ కష్టాలు తీరుతాయో లేదో అని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

నాలుగున్నరేళ్లుగా..

ప్రభుత్వ లెక్కల ప్రకారం ప్రతీ 5 వేల జనాభాకు ఒక మీసేవ కేంద్రం ఉండాలి. కానీ మొయినాబాద్ మండలంలో 70 వేలకుపైగా జనాభా ఉన్నా ఒకటే అందుబాటులో ఉంది. సుమారు నాలుగున్నర సంవత్సరాలుగా ఈ పరిస్థితి ఉన్నా కొత్త మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేయడంలో ప్రభుత్వం ముందడుగు వేయడం లేదు. దీంతో విద్యార్థులు, నిరుద్యోగులు, రైతులు, ప్రజలకు తిప్పలు తప్పడం లేదు. మొయినాబాద్ మండల ప్రజలకు మీసేవ కష్టాలు తీరడం లేదు. సుమారు నాలుగున్నర సంవత్సరాలుగా ఇబ్బందులు పడుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. మొయినాబాద్ మండలంతో పాటు మున్సిపాలిటీ మొత్తానికి ఒకే మీసేవ కేంద్రం ఉండడంతో ప్రజల కష్టాలు రోజురోజుకు పెరుగుతున్నాయి. నగర శివారు ప్రాంతంలో ఉన్న మొయినాబాద్ మండలంలో ప్రభుత్వం గతంలో మూడు మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేసింది. అందులో రెండు మీసేవ కేంద్రాలు నాలుగున్నర సంవత్సరాల క్రితమే మూతపడ్డాయి. నాలుగున్నర సంవత్సరాల క్రితం హిమాయత్‌నగర్ మీసేవా కేంద్రం నిర్వాహకుడు మరణించడంతో అది మూతపడింది. అదేవిధంగా నాలుగేళ్ల క్రితం మొయినాబాద్ మండల కేంద్రంలోని మీసేవ కేంద్రాన్ని జిల్లా అధికారులు సీజ్ చేశారు. దీంతో రెడ్డిపల్లిలో ఉన్న మీసేవ కేంద్రం ఒక్కటే మండల ప్రజలకు దిక్కయ్యింది. మండలంలో మరో కేంద్రం లేకపోవడంతో విధిలేని పరిస్థితుల్లో రెడ్డిపల్లికే వెళ్లాల్సి వస్తోంది.

అన్ని సర్టిఫికెట్లు ఆన్‌లైన్‌లోనే..

మండలంలో ఒకే మీసేవ కేంద్రం ఉండటంతో ప్రజలు ఇబ్బందులు తప్పడం లేదు. ప్రస్తుతం ప్రతీది ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాల్సిన పరిస్థితి ఉండటంతో అందరూ మీసేవ కేంద్రాలకే వెళ్తున్నారు. స్కూళ్లు, కాలేజీల్లో చదివే విద్యార్థులు కులం, ఆదాయం, నివాసం, పుట్టినతేదీ సర్టిఫికెట్ల కోసం ఆన్‌లైన్‌లోనే దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుంది. దీనికితోడు రెవెన్యూకు సంబంధించిన చాలా దరఖాస్తులను మీసేవ కేంద్రంలోనే చేసుకోవాలి. దీంతో విద్యార్థులు, రైతులు చాలా మంది రెడ్డిపల్లి మీసేవ వద్దకే వెళ్లాల్సి వస్తోంది. ఒకటే కేంద్రం ఉండటం అందరూ అక్కడికే వెళ్లడంతో గంటల తరబడి వేచి ఉండాల్సిన పరిస్థితి. కొంత మంది ఇతర మండలాల్లోని మీసేవ కేంద్రాలకు వెళ్తున్నారు. దీనిపై ప్రభుత్వ అధికారులు దృష్టి సారించాలని ప్రజలు కోరుతున్నారు.

మీసేవ కేంద్రాలు ఏర్పాటు చేయాలి



రెడ్డిపల్లిలో ఒకే మీసేవ కేంద్రం ఉండటంతో రైతులు, విద్యార్థులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. చట్టుపక్కన గ్రామాల ప్రజలకు అంత దూరం వెళ్లడం ఇబ్బందిగా మారింది. గతంలో ఉన్న మీసేవ కేంద్రాలను తెరిపించేందుకు అధికారులు కృషి చేయాలి. మండలంలో మరికొన్ని కొత్త కేంద్రాలను కూడా ఏర్పాటు చేయాలి.

-జొన్నాడ రాజు, చిలుకూరు, మొయినాబాద్ మున్సిపాలిటీ

ప్రతిపాదనలు పంపాం



మొయినాబాద్ మండలంలో ప్రస్తుతం ఒకే మీసేవ కేంద్రం ఉంది. మండలంలో కొత్తగా మరో నాలుగు కేంద్రాల ఏర్పాటుకు ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపాం. మీసేవ కేంద్రాల అవసరాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లాం. దీనిపై ప్రభుత్వం అనుమతి ఇవ్వాల్సి ఉంది.

-గౌతమ్‌కుమార్, తహసీల్దార్, మొయినాబాద్

అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: అర్హులైన నిరుపేదలందరికీ ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తుందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని పలు వార్డుల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్యే హాజరై మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను సీఎం రేవంత్‌రెడ్డి నెరవేస్తున్నారన్నారు. ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఎదురైనా ప్రజలకు ఇచ్చిన మాటలకు ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉండి ముందుకు సాగుతోందన్నారు. ప్లాట్లు ఉన్న పేదలకు ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తుందన్నారు. నియోజకవర్గంలో 3,500ల ఇళ్లు కేటాయించిందని వెల్లడించారు. రాష్ట్రాన్ని పదేళ్లు పాలించిన బీఆర్‌ఎస్ నేతలు మాయమాటలు చెప్పి ప్రజలను మోసం చేశారని విమర్శించారు. పేదలందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని చెప్పిన గత పాలకులు ఒక్కరికి కూడా ఎందుకు పంపిణీ చేయలేదని ప్రశ్నించారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా కాంగ్రెస్ ప్రభుత్వం అభివృద్ధి, సంక్షేమ పథకాలను చేపడుతుందన్నారు. షాద్‌నగర్‌లో అసంపూర్తిగా ఉన్న డబుల్ బెడ్రూం ఇళ్లకు ప్రభుత్వం రూ.7కోట్లు కేటాయించినట్లు స్పష్టం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సునీత, నాయకులు బాబర్‌ఖాన్, విశ్వం, చెన్నయ్య, చెంది తిరుపతిరెడ్డి, రాజేందర్‌రెడ్డి, బస్వం, రఘునాయక్, అప్పి, యాదగిరియాదవ్, శ్రీనివాస్‌రెడ్డి, జమృద్‌ఖాన్, ఇబ్రహీం, తుపాకుల శేఖర్, రాయికల్ శ్రీను, సీతారాం, నవీన్, ఖదీర్, అశోక్, వాసు, మన్నె రవి తదితరులు పాల్గొన్నారు.



షాద్‌నగర్‌లో లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

నిబంధనల ప్రకారం నిర్మాణాలు చేపట్టాలి

మండల విద్యాధికారి చంద్రశేఖర్

కేశంపేట: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో ప్రభుత్వ నిబంధలు పాటించాలని మండల విద్యాధికారి చంద్రశేఖర్ అన్నారు. మండల పరిధిలోని వేముల నర్వ గ్రామంలో 42 మంది లబ్ధిదారుల ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలకు గ్రామ ప్రత్యేక అధికారి, మండల విద్యాధికారి సోమవారం భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇళ్ల నిర్మాణాలను నాణ్యతతో చేపట్టాలన్నారు. మూడు విడతలుగా బిల్లులను హౌసింగ్ శాఖ ద్వారా అందిస్తామని వెల్లడించారు. అవినీతికి ఆస్కారం లేకుండా లబ్ధిదారులకు నేరుగా బిల్లును చెల్లిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి వరలక్ష్మి, మల్లేశ్, గోపాల్, నర్సింలు, అనంద్, శివమ్మ, రాఘవేందర్, అంజనేయులు, శ్రీను, ప్రభాకర్, మనోహర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న ఎంఈఓ చంద్రశేఖర్

విద్యార్థులు ప్రమాద స్థలాలకు వెళ్లొద్దు

సమ్మర్ క్యాంప్ కోర్సు డైరెక్టర్ మల్లయ్య



మాట్లాడుతున్న కోర్సు డైరెక్టర్ మల్లయ్య

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు సెలవు దినాల్లో ప్రమాద స్థలాల వద్దకు వెళ్లొద్దని, ఎండలో తిరగకూడదని సమ్మర్ క్యాంప్ కోర్సు డైరెక్టర్ ఎం.మల్లయ్య సూచించారు. సోమవారం మండల పరిధిలోని కనకమామిడి, మున్సిపల్ పరిధిలోని అజీజ్‌నగర్‌లో సమ్మర్ క్యాంప్ ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వం విద్యార్థులకు ఉచిత వేసవి శిక్షణ నిర్వహించిందన్నారు. 6 నుంచి 9వ తరగతి చదువుతున్న విద్యార్థులు సెలవుల్లో చెడు అలవాట్లకు బానిసలు కాకుండా, బయట తిరగకుండా క్యాంప్ ఏర్పాటు చేసిందన్నారు. 5వ తేదీ నుంచి 19వ తేదీ వరకు క్యాంప్ ఏర్పాటు చేసి విద్యార్థులకు అల్పాహారం అందించిందని పేర్కొన్నారు. ఈ క్యాంప్ విజయవంతంగా నిర్వహించిన శిక్షణ అధికారులు, ఉపాధ్యాయులు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఆసక్తిగా పాల్గొన్న విద్యార్థులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో హెచ్‌ఎంలు అరుణ్‌గౌడ్, అబ్దుల్ అమీద్ తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలి

మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్



మహిళా రైతుతో మాట్లాడుతున్న పాలక మండలి సభ్యులు

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని షాద్‌నగర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ బాబర్‌ఖాన్ అన్నారు. సోమవారం షాద్‌నగర్ మార్కెట్ యార్డును మార్కెట్ పాలక మండలి సభ్యులు సందర్శించారు. ఈ సందర్భంగా ధాన్యం విక్రయించేందుకు మార్కెట్‌కు వచ్చిన రైతులతో వారు మాట్లాడారు. ఈ సందర్భంగా బాబర్‌ఖాన్ మాట్లాడుతూ.. రైతులు ప్రైవేటు వ్యాపారులను నమ్మి మోసపోవద్దని, ప్రభుత్వం ఏర్పాటు చేసిన కేంద్రాల్లో ధాన్యం విక్రయించి లాభాలు పొందాలని సూచించారు. ప్రభుత్వం క్వింటాల్‌కు రూ.2320 మద్దతు ధరతో పాటుగా బోనస్ చెల్లిస్తుందని తెలిపారు. వారం రోజుల్లోగా రైతుల బ్యాంకుల ఖాతాల్లో డబ్బులు జమ చేస్తుందని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పాలక మండలి సభ్యులు కరుణాకర్, మల్లేశ్, భరత్, మార్కెట్ కార్యదర్శి శ్రీనివాస్, సూపర్‌వైజర్ రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వెంకిర్యాల వాగు పరిశీలన



వాగును పరిశీలిస్తున్న అధికారులు, నాయకులు

కొందుర్గు: కొందుర్గు నుంచి మహబూబ్‌నగర్ ఆర్‌అండ్‌బీ రోడ్డులో గల వెంకిర్యాల వాగును ఆర్‌అండ్‌బీఈఈ రవీందర్ సోమవారం పరిశీలించారు. రానున్న వర్షాకాలంలో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కోకుండా ఉండేందుకు త్వరితగతిన వంతెన నిర్మాణ పనులు ప్రారంభించాలని ఈ సందర్భంగా కాంట్రాక్టర్‌కు సూచించారు. వంతెన నిర్మాణంలో ఎలాంటి ఇబ్బందులు ఎదురైనా తాను సహకరిస్తానని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఇచ్చిన హామీ మేరకు కాంట్రాక్టర్ వంతెన నిర్మాణం చేపట్టేందుకు ముందుకొచ్చారని కాంగ్రెస్ నాయకులు జితేందర్‌రెడ్డి వివరించారు. వంతెన నిర్మాణం ప్రారంభించడం సంతోషకరమని స్థానిక నాయకులు మాసయ్యగౌడ్, మల్లయ్య అన్నారు.

కాంగ్రెస్ చేతల ప్రభుత్వం



లబ్ధిదారులకు మంజూరు పత్రాలను అందజేస్తున్న చంద్రశేఖర్, నాయకులు

గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ చంద్రశేఖర్

షాబాద్: కాంగ్రెస్ చేతల ప్రభుత్వమని పేద ప్రజలకు తెలుసని గుడిమల్కాపూర్ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కావలి చంద్రశేఖర్ అన్నారు. సోమవారం మండల పరిధిలోని హైతాబాద్ గ్రామంలో ఇందిరమ్మ ఇల్లు మంజూరైన లబ్ధిదారులకు మంజూరుపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వంలో అర్హులైన ప్రతీ ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు వస్తాయన్నారు. పేద ప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. గత ప్రభుత్వ నాయకులు మాటలతోనే కాలక్షేపం చేశారని, అభివృద్ధి కోసం చేసిందేమీ లేదని విమర్శించారు. అధికారంలో ఉండి దోచుకొని దాచుకున్నారే తప్పా ప్రజల అవసరాలు, రాష్ట్ర అభివృద్ధిపై దృష్టి పెట్టలేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన ప్రతి ఒక్క మాటను తూచ తప్పకుండా నిలబెట్టుకునేందుకు ముందుకు సాగుతోందని, అందులో భాగంగానే నేడు పేద ప్రజల కల నెరవేర్చుతోందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఖాజామీయా, ఇందిరమ్మ కమిటీ సభ్యులు అత్తిలి శ్రీనివాస్‌రెడ్డి, యాదయ్య, అండాలు, కొమురమ్మ, నాయకులు ఎండీ బురాన్, ఆకుల కృష్ణ, చర్ల సత్తయ్య, నర్సింహ, శ్రీనివాస్, కృష్ణ, రవి, ప్రవీణ్, రహమత్‌ఖాన్, శంకర్, రాముగౌడ్ తదితరులు ఉన్నారు.

ఆధ్యాత్మికతతో మానసిక ప్రశాంతత



దేవాలయ పునర్నిర్మాణానికి భూమిపూజ చేస్తున్న విజయకుమార్, నాయకులు

రాష్ట్ర హాకీ చైర్మన్ కొండ విజయకుమార్

షాబాద్: ఆధ్యాత్మిక చింతనతో ప్రతీ ఒక్కరికి మానసిక ప్రశాంతత కలుగుతుందని రాష్ట్ర హాకీ చైర్మన్ కొండ విజయకుమార్ అన్నారు. సోమవారం మండల కేంద్రంలోని శివాలయంలో దేవాలయ పునర్నిర్మాణానికి భూమిపూజ చేసి, అభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దైవ భక్తితో పాటు సమాజహితం కోసం పాటు పడాల్సిన అవసరం ఉందన్నారు. హరహర మహాదేవ శంభో శంకర అంటూ భక్తులు శివనామస్మరణ చేశారు. ప్రతి ఒక్కరూ కొంత సమయం భగవంతుడికి కేటాయించాలని సూచించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాజీ సభ్యుడు జడల రాజేందర్‌గౌడ్, మాజీ సర్పంచ్‌లు తమ్మలి రవీందర్, కాల్వకోలు వెంకట్ యాదవ్, మాజీ ఎంపీటీసీలు అశోక్, సత్యనారాయణ, శ్రీనుపంతులు, నాయకులు లింగప్ప, శ్రీకారప్ప, మల్లికార్జున్, దండు రాహుల్‌గుప్తా, మధుస్ గుప్తా, దర్పల్లి రవీందర్‌గౌడ్, గడ్డం రమేశ్, సత్యం, శివకుమార్, కమ్మరి శ్రీను, విశ్వనాథ్‌గుప్తా, గడ్డం చంద్రయ్య, వెంకటయ్య, తదితరులు ఉన్నారు.

ఛత్రపతి శివాజీ విగ్రహావిష్కరణ

చేవెళ్ల: పోరాటయోధుడు ఛత్రపతి శివాజీ అందరికీ ఆదర్శప్రాయుడని ప్రముఖ వక్త, సిద్దార్థ కళాశాల ప్రిన్సిపాల్ జయదేవ్, స్థానిక ప్రజాప్రతినిధులు అన్నారు. మండలంలోని తంగడపల్లి అనుబంధ గ్రామమైన మడికట్టు గ్రామంలో గ్రామస్తులందరూ కలిసి ఏర్పాటు చేసుకున్న ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని జయదేవ్, పీఏసీఎస్ చైర్మన్లు వెంకట్‌రెడ్డి, గోనే ప్రతాప్‌రెడ్డి, పలు పార్టీల నాయకుల ఆధ్వర్యంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామాల్లో పోరాటయోధుల విగ్రహాల ప్రతిష్ఠతో వారి స్ఫూర్తిని గుర్తు చేస్తుందన్నారు. యువత ఛత్రపతి శివాజీని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ విగ్రహ ఏర్పాటుకు కృషి చేసిన గ్రామ యువకులను, పెద్దలను అభినందించారు. కార్యక్రమంలో బీజేపీ మున్సిపల్ అధ్యక్షుడు అనంత్‌రెడ్డి, యువనాయకుడు డాక్టర్ వైభవ్‌రెడ్డి, నాయకులు వెంకట్‌రెడ్డి, కాంగ్రెస్, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు ఆగిరెడ్డి, పాండు, రాములు, సత్తయ్య, గ్రామస్తులు, యువకులు తదితరులు ఉన్నారు.



ఛత్రపతి శివాజీ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న సిద్ధార్థ కళాశాల ప్రిన్సిపాల్ జయదేవ్, నాయకులు

పంట మార్పిడితో అధిక లాభాలు



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

జయశంకర్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త రవీందర్

మొయినాబాద్‌రూరల్: పంట మార్పిడితో రైతులు అధిక లాభాలు పొందవచ్చని రాష్ట్ర వ్యవసాయ ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్త రవీందర్, మండల వ్యవసాయ అధికారి అనురాధ అన్నారు. సోమవారం మండల పరిధిలోని కేతిరెడ్డిపల్లి గ్రామంలో రైతు ముంగిట్లో శాస్త్రవేత్తలు కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి అనురాధ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్త రవీందర్, అనురాధ, సర్దార్‌నగర్ మార్కెట్ కమిటీ మాజీ వైస్ చైర్మన్ దారెడ్డి వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వేసవి దుక్కులతో భూమి సారవంతంగా ఉంటుందన్నారు. ఎండాకాలంలో భూమిని దున్నడంతో తొలకరి వర్షాలు పడగానే నీరు భూమిలోకి ఇంకుతుందని తెలిపారు. రైతులు ఒకే పంటపై ఆధారపడకుండా పంట మార్పిడిపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు దారెడ్డి వెంకట్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వడ్ల వెంకటయ్య, యాదయ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు.

నేటినుంచి ఉపాధ్యాయులకు శిక్షణ

మండల విద్యాధికారి పురన్‌దాస్

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలల్లో ప్రాథమిక స్థాయిలో విద్యానైపుణ్యాలను పెంచేందుకు ప్రభుత్వం ఉపాధ్యాయులకు ప్రత్యేక శిక్షణ తరగతులను నిర్వహిస్తోందని మండల విద్యాధికారి పురన్‌దాస్ తెలిపారు. చేవెళ్ల మండలంలోని వివేకానంద ఇంటర్నేషనల్ పాఠశాలలో శిక్షణ తరగతుల నిర్వహణ ఏర్పాట్లను సోమవారం ఎంఈఓ డీఆర్పీలు, సీఆర్పీలతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లోని ప్రాథమిక స్థాయి ఉపాధ్యాయులకు 5 రోజుల పాటు ఎఫ్‌ఎల్‌ఎన్, ఏఐ గురించి వృత్యాంతర శిక్షణ తరగతులు ఉంటాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న ఈ శిక్షణ తరగతులను మండలాల వారీగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. డీఆర్పీలు ఉపాధ్యాయులకు శిక్షణ అందిస్తారన్నారు. ఉపాధ్యాయులకు 20 నుంచి 25వ తేదీ వరకు ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు తరగతులు కొనసాగుతాయని వెల్లడించారు. తరగతులకు ఉపాధ్యాయులు సకాలంలో హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో కృష్ణ, శంకర్, నర్సింలు, శ్రీనివాస్ ఉన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ పురన్‌దాస్

సాంఘిక సంక్షేమ పాఠశాలలో..

మొయినాబాద్‌రూరల్: తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల కోడింగ్ పాఠశాలలో సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు, ఐసీటీ సిబ్బందికి శిక్షణ ఇస్తున్నారని ప్రిన్సిపాల్ రమాదేవి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా సోమవారం ఆమె మాట్లాడుతూ.. తెలంగాణలోని 1 నుంచి 7 జోన్‌లలో మొత్తం 238 సాంఘిక సంక్షేమ పాఠశాలల్లో ప్రతి పాఠశాల నుంచి ఒక స్టీమ్ రెగ్యులర్ టీచర్, ఐసీటీ సిబ్బందికి స్పెషల్ ప్రోగ్రామ్ ఎక్స్‌టెన్షన్ ఆఫ్ కోడింగ్ అండ్ కంప్యూటరింగ్ కరికులంపై శిక్షణ ఇస్తారన్నారు. జోన్ 3, 4లోని 127 మంది స్టీమ్ రెగ్యులర్ ఐసీటీలకు 19 నుంచి 23వ తేదీవరకు శిక్షణ ఉంటుందని, ప్రతి ఒక్కరూ హాజరుకావాలని కోరారు.